ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 33 | శనివారం 04, సెప్టెంబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

MHR TV

# లిక్కర్ షాపులకు దసరా కిక్కు

**పండుగవేళ రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు**

**సెప్టెంబర్ 30న ఒక్కరోజే రూ. 333 కోట్ల మద్యం కొనుగోళ్లు**

**గాంధీ జయంతి డ్రై డే కారణంగా ముందురోజే పోటెత్తిన జనం**

**వివరాలు వెల్లడించిన తెలంగాణ ఎక్సైజ్ శాఖ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

దసరా పండుగ, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో తెలంగాణలో మద్యం అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. పండుగకు ముందు కేవలం రెండు రోజుల్లోనే ఏకంగా రూ. 419 కోట్ల విలువైన మద్యం అమ్ముడు పోయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే ఇది భారీ పెరుగుదల అని వారు తెలిపారు. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 30న అత్యధికంగా రూ. 333 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీన మరో రూ. 86 కోట్ల ..మిగతా 2లో





## వైభవంగా అలయ్ బలయ్

దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో అలయ్ బలయ్
హాజరైన తెలంగాణ గవర్నర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
అందరం కలిసి ఉండాలనేదే అలయ్ బలయ్ ఉద్దేశమన్న వెంకయ్యనాయుడు

02



## కాంగ్రెస్ పాలనలో ఆర్థిక విధ్వంసం

జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో అట్టడుగు స్థానం
వ్యవసాయం నుంచి రియల్ ఎస్టేట్ దాకా అన్నింట్లో పతనం
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
మూడు రోజుల విదేశీ పర్యటనకు పయనం

02



# రెండేండ్ల తర్వాత కదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం

## ఎట్టకేలకు కాళేశ్వరం పునరుద్ధరణ చర్యలు

**కాళేశ్వరం కూలిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం**

**పగులును సాకుగా చూపి రెండేండ్లు పడావు**

**ఇప్పుడు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల మరమ్మతుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం**

**ఏజెన్సీలను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ**

**అన్ని వైపుల నుంచి ఒత్తిడితో కదిలిన సర్కార్**

**స్థానిక ఎన్నికల భయంతోనే రిపేరుకు..**

**కాళేశ్వరం పనికిరాదన్నారు..**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:**

కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటే తెలంగాణ వరదాయిని. గోదావరిలో తెలంగాణ వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే. ఈ విషయాన్ని ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కార్ అంగీకరించింది. ఇంతకాలం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, ఇతర బరాజ్‌లపై అడ్డగోలుగా అసత్య ఆరోపణలకు దిగిన ప్రభుత్వం తాజాగా బరాజ్‌ల పునరుద్ధరణకు పూనుకున్నది. తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం, నిర్దేశిత లక్ష్యాల మేరకు నీటి మళ్లింపు అసాధ్యమని ఇంజినీరింగ్ అధికారులు కరాఖండిగా తేల్చిచెప్పడంతోపాటు, గత రెండేండ్లుగా రబీ సీజన్‌లో పూర్తిస్థాయిలో నీటిని అందివ్వకపోవడంతో రైతుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తప్పనిసరి స్థితిలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ఎట్టకేలకు మేడిగడ్డ మరమ్మతులపై దృష్టి సారించింది. బరాజ్‌ల పునరుద్ధరణకు ..మిగతా 2లో

# దామోదర్ రెడ్డికి నివాళి

అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి భౌతికకాయానికి సీఎం సహా ఇతర ప్రముఖుల నివాళి
పార్టీకి, నల్లగొండ ప్రజలకు తీరని లోటు: రేవంత్ రెడ్డి



08

## తెలంగాణకు రక్షణ శాఖ భూములు ఇవ్వండి

రక్షణ శాఖ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని మెమోరాండం
తెలంగాణ ప్రభుత్వానికి రావాల్సిన యూజర్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్న పొన్నం
కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు త్వరగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్న పొన్నం



02

న్యూడ్ ఫొటోలు పంపించాలని

## నా కూతురిని అడిగాడు

ఆన్‌లైన్ గేమ్‌లో తన కుమార్తెకు ఎదురైన వేధింపుల ఘటనను బయటపెట్టిన అక్షయ్ కుమార్
పొగడ్తలతో మొదలుపెట్టి న్యూడ్ ఫోటో పంపాలంటూ ఆగంతకుడి బెదిరింపు
ఎంతో మంది చిన్నారులు బాధితులవుతున్నారని ఆవేదన
పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచన
స్కూళ్లలో సైబర్ క్రైమ్‌పై ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



03

కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలపై

# కాషాయ జెండా ఎగరేస్తాం

**ప్రజలు ఎదురు చూస్తున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పై బీజేపీ ఆధిక్యత**

**అభ్యర్థుల ఎంపిక సర్వేల ఆధారంగా.. పార్టీ సహాయం అందుబాటులో**

**గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం.. కేంద్ర నిధుల ప్రాధాన్యం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

స్థానిక సంస్థల ఎన్నికల దిశగా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు గట్టిగా ఓడించేందుకు ఎదురు చూస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, జడ్పీటీసీ ప్రభారీలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా పరిషత్ పీఠంపై కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని, సిరిసిల్ల జడ్పీ పీఠం కూడా ఈసారి బీజేపీ ఖాతాలో ..మిగతా 2లో



# ఉస్మానియా కొత్త ఆస్పత్రి భవనం ఎన్ని అంతస్తులో తెలుసా..?

గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి పునాది రాయి
శాస్త్రోక్త పూజలతో పనులు ప్రారంభం
12 అంతస్తుల, 2,000 పడకల ఆధునిక ఆస్పత్రి భవనాలు
ఆపరేషన్ థియేటర్లు, హెలిప్యాడ్, నర్సింగ్/డెంటల్ ఫిజియోథెరపీ కళాశాలలు ఏర్పాట్లు



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనాల నిర్మాణానికి పునాది రాయి వేయడం జరిగింది. దసరా పర్వదినం సందర్భంగా శాస్త్రోక్త పద్ధతిలో పూజలు చేసి, ఎంఈఐఎల్ డైరెక్టర్ కె. గోవర్ధన్ రెడ్డి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తెలిపారు, "నిర్దేశిత సమయానికి భవనాల నిర్మాణం పూర్తి చేసి, ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రత్యామ్నాయంగా ఆధునిక సౌకర్యాలతో ..మిగతా 2లో

# లిక్కర్ షాపులకు దసరా కిక్కు..

**మొదటిపేజీ తరువాయి**

మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. వాస్తవానికి సెప్టెంబర్ 26 నుంచే రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు రెట్టింపైనట్లు అధికారులు పేర్కొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. అదే రోజు దసరా పండుగ కూడా ఉండటంతో, మందుబాబులు ఒకరోజు ముందుగానే పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు. ఈ కారణంగా అక్టోబర్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైన్ షాపులు, లిక్కర్ మార్ట్‌ల వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. పలుచోట్ల మద్యం కోసం జనం బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. పండుగ సీజన్‌తో పాటు డ్రై డే కూడా కలిసి రావడమే ఈ భారీ అమ్మకాలకు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు.



# వైభవంగా అలయ్ బలయ్

- **దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో అలయ్ బలయ్**
- **హాజరైన తెలంగాణ గవర్నర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు**
- **అందరం కలిసి ఉండాలనేదే అలయ్ బలయ్ ఉద్దేశమన్న వెంకయ్యనాయుడు**

**తెలంగాణ బ్యూరో, ప్రజా స్వరం :**

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ ముగిసిన మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో దత్తాత్రేయ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈరోజు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన అతిథులకు దత్తాత్రేయ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీం కోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, సినీ నటులు నాగార్జున, బ్రహ్మానందం, ఏపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సీపీఐ నేత నారాయణ, తెలంగాణ జన సమితి నేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హనుమంత రావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, వేష భాషలు వేరైనా మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరం ఐక్యంగా ఉండాలనే సదుద్దేశంతో అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దత్తాత్రేయ గత ఇరవై సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్గం, జాతి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి ప్రయత్నాలు విఫలం కావడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.



# దిక్కుతోచని సర్కారుకు.. మేడిగడ్డే దిక్కు

**మొదటిపేజీ తరువాయి**

నడుం బిగించింది. డిజైన్ కన్సల్టెన్సీల నుంచి ఈవోఐ (ఎక్స్‌ప్రెషన్స్ ఆఫ్ ఇంట్రస్ట్) కోసం నోటిఫికేషన్ జారీచేసింది.

**మేడిగడ్డే శరణ్యం**

తెలంగాణకు గోదావరిలో 968టీఎంసీల వాటా ఉన్నది. అందులో రాష్ట్ర ఏర్పాటు నాటికి నికరంగా 200 టీఎంసీలను కూడా వినియోగించుకోలేని పరిస్థితి. మరోవైపు అప్పటికే నిర్మించిన ఎస్సారెస్పీ, కడెం తదితర ప్రాజెక్టులు పూడికతో పేరుకుపోయాయి. తద్వారా గోదావరిలో 50టీఎంసీల మేరకు నీటి నిల్వ సామర్థ్యాన్ని తెలంగాణ కోల్పోయిన దుస్థితి. ఈ నేపథ్యంలో గోదావరిలో రాష్ట్ర వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఏకైక పరిష్కార మార్గం ప్రాణహిత జలాలు మాత్రమే. అయితే తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్)తో బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోకపోవడం, మరోవైపు ఎగువన మహారాష్ట్ర వినియోగం తరువాత ప్రతిపాదిత 160 టీఎంసీల జలాలు అందుబాటులో లేని దుస్థితి నెలకొన్నది. ఈ విషయాన్ని సీడబ్ల్యూసీనే వెల్లడించింది. చివరికి మహారాష్ట్ర కేవలం 148ఎఫ్ఆర్ఎల్‌తో బరాజ్‌ను నిర్మించేందుకు అంగీకరించింది.

ఇక ఆ స్థాయిలో బరాజ్‌ను నిర్మిస్తే తమ్మిడిహట్టి నుంచి గరిష్ఠంగా 44టీఎంసీలను మాత్రమే మళ్లించుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ మేధోమథనం సాగించారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుపై ఇంజినీర్లతో సుదీర్ఘంగా చర్చించారు. గోదావరిలో తెలంగాణ వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు అనుగుణంగా ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. ప్రాణహిత చేవేళ్లను రెండు ప్రాజెక్టులుగా విభజించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టును కేవలం ఆదిలాబాద్ జిల్లాకు పరిమితం చేశారు. తమ్మిడిహట్టి నుంచి బరాజ్ లోకేషన్ మేడిగడ్డకు మార్చి కాళేశ్వరం ప్రాజెక్టుగా నామకరణం చేశారు. గోదావరిలో తెలంగాణ తన నీటివాటాను పూర్తిగా వినియోగించుకునే విధంగా ప్రణాళికలను రూపొందించారు.

**రైతుల నుంచి వ్యతిరేకత**

తెలంగాణలో సాగునీటి రంగం గురించి చెప్పాలంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు, ఆ తరువాత అనే చెప్పాల్సి ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి తెలంగాణలో పంటల విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఎస్సారెస్పీ మొదటి ఆయకట్టుకు పూర్తి భరోసా దక్కడమే కాదు, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఫేజ్ 2 ఆయకట్టుకు సైతం సాగునీరు అందడం ప్రారంభమైంది. బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన ఇతర అభివృద్ధి, ప్రణాళికలను ఫలితంగా సాగువిస్తీర్ణం పెరిగింది. కాంగ్రెస్ మాత్రం దీనిని అంగీకరించేందుకు ససేమిరా అంది.

కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్‌ను నిలిపేసిన నాటి నుంచి ఉమ్మడి ఏపీలోని పరిస్థితులు పునరావృతమవుతూ వస్తున్నాయి. ఎస్సారెస్పీ స్టేజీ2ను పక్కనపెడితే ఫేజ్ 1లోని జగిత్యాల, మంథని తదితర నియోజకవర్గాల్లోనే రబీ సీజన్‌కు సక్రమంగా సాగునీరు అందని దుస్థితి. ఈ నేపథ్యంలో రైతాంగం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతూ వస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టును మరమ్మతు చేయకుండా, నిరర్థకమంటూ రాజకీయాలు చేయడాన్ని రైతాంగం తప్పుబట్టింది. రైతుల ఆగ్రహం స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు చేటు చేస్తుందని భావించిన ప్రభుత్వం నష్టనివారణ చర్యలను చేపడుతున్నట్టు తెలిసింది. అందులో భాగంగా బరాజ్‌ల పునరుద్ధరణకు నడుం బిగించినట్టు సమాచారం.

**15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు పునరుద్ధరణ పనులకు సంబంధించి డిజైన్లను సమకూర్చేందుకు అనుభవమున్న ఏజెన్సీల నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం ప్రారంభించింది. మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20 పిల్లర్



కుంగుబాటునకు గురైన విషయం తెలిసిందే. దానిపై ఎన్డీఎస్ఏ ఇప్పటికే పూర్తిస్థాయి నివేదికను సమర్పించింది. అంతేకాదు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పటిష్టతకు చేపట్టాల్సిన తదుపరి చర్యలను ఇరిగేషన్‌శాఖకు పలు సిఫారసులు చేసింది. కేంద్ర, జాతీయ సంస్థలతో అధ్యయనం చేయించి, వాటి సహకారంతో పునరుద్ధరణ పనులను నిర్వహించాలని వెల్లడించింది. అయితే కాంగ్రెస్ సర్కారు ఇంతకాలం దీనిపై తాత్సారం చేస్తూ వచ్చింది. తాజాగా రైతాంగం నుంచి వ్యతిరేకత, బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ నేపథ్యంలో ఎట్టకేలకు బరాజ్‌ల పునరుద్ధరణకు పూనుకున్నది. బరాజ్‌ల పునరుద్ధరణకు సంబంధించి డిజైన్లను రూపొందించడంలో తమకు తగినంత అనుభవం లేదని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) చేతులెత్తేసింది. ఈ నేపథ్యంలో బరాజ్‌ల నిర్మాణంలో, పునరుద్ధరణ పనుల్లో అనుభవమున్న ఏజెన్సీలను కన్సల్టెన్సీగా ఏర్పాటు చేసుకోవాలని సర్కారు నిర్ణయించింది. అందులో భాగంగా బుధవారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఎన్డీఎస్ఏ సిఫారసుల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ పనులకు డిజైన్లను సమకూర్చేందుకు అనుభవం, ఆసక్తి ఉన్న ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. 15వ తేదీ నాటికి ఏజెన్సీలు (ఈవోఐ)ని వెల్లడించాలని, వివరాలకు ఇరిగేషన్ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని తెలిపింది.

ప్రాజెక్టును బలిచ్చేందుకు విఫలయత్నం

మేడిగడ్డలో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక సమస్యను సాకుగా చూపి మొత్తం ప్రాజెక్టును బలిపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రాజెక్టు నిరర్థకం అన్నస్థాయిలో ప్రచారం చేసింది. దాదాపు రెండేండ్లుగా బరాజ్‌కు మరమ్మతులు చేపట్టకుండా రాజకీయాలకు పాల్పడింది. తొలుత ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ), ఆ తరువాత విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పేరిట కాలయాపన చేసింది. అవినీతి మరకలను అంటించేందుకు, బీఆర్ఎస్‌ను, మాజీ సీఎంను బద్నాం చేసేందుకు ప్రయత్నించింది. అయితే కాంగ్రెస్ సర్కార్ ఆశించిన స్థాయిలో ఆయా కమిషన్ల నివేదికలు రాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు సరైనదేనని నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు డైలమాలో పడింది. దీనికితోడు తమ్మిడిహట్టి నుంచి నిర్దేశించిన మేరకు జలాలను తరలించలేమని ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఇంజినీర్లే ప్రభుత్వానికి స్పష్టంగా తేల్చిచెప్పారు. తమ్మిడిహట్టి వద్ద బరాజ్‌ను నిర్మించినా తెలంగాణకు సంబంధించిన పూర్తిస్థాయి నీటివాటాను వినియోగించుకోవాలంటే మేడిగడ్డ పునరుద్ధరణ అనివార్యమని తేల్చిచెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎట్టకేలకు బరాజ్ పునరుద్ధరణపై దృష్టి సారించినట్టు తెలిసింది.


## ఉస్మానియా కొత్త ఆస్పత్రి భవనం
# ఎన్ని అంతస్తులో తెలుసా..?

**మొదటిపేజీ తరువాయి**

ఆస్పత్రిని నిర్మిస్తాం" అని.

26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం జరుగుతోన్న ఈ భవనాల శంకుస్థాపన ఈ ఏడాది జనవరి 31న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతనం జరిగింది. భవనాలు 12 అంతస్తులుగా, 2,000 పడకల సామర్థ్యం కలిగివుంటాయి. భవనాల బేస్‌మెంట్‌లో రెండు అంతస్తుల పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తారు. నిర్మాణం రెండు సంవత్సరాల్లో పూర్తయ్యే లక్ష్యంతో ప్రారంభమైంది.

నూతన ఆస్పత్రిలో 29 మేజర్, 12 మైనర్ ఆపరేషన్ థియేటర్లు, హెలిప్యాడ్ ఏర్పాటు చేయబడతాయి. రోబోటిక్ సర్జరీ, ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే, నర్సింగ్, డెంటల్, ఫిజియోథెరపీ విభాగాల కోసం ప్రత్యేక కళాశాలలు కూడా నూతన భవనాల్లో ఏర్పాటు చేయబడతాయి.



# తెలంగాణకు రక్షణ శాఖ భూములు ఇవ్వండి

- **రక్షణ శాఖ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని మెమోరాండం**
- **కంటోన్మెంట్ బోర్డుకు ఎన్నికలు త్వరగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్న పొన్నం**

తెలంగాణ బ్యూరో, ప్రజా స్వరం : హైదరాబాద్ అభివృద్ధి కోసం రక్షణ శాఖ భూముల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వ తరఫున ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ కు లేఖ రాశారు. ఈ లేఖపై జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సంతకాలు కూడా ఉన్నాయి. మంత్రి పొన్నం తన లేఖలో రక్షణ శాఖ భూములను ప్రజా ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించేందుకు కేంద్రం సానుకూలంగా ముందుకు రావడంపై ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో, మౌలిక సదుపాయాల విస్తరణకు రక్షణ భూములు కీలకంగా ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. అంతేకాక, కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల కింద సుమారు రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన విడుదల చేస్తే ప్రజా మౌలిక వసతులు, పౌర సేవలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ప్రజా వినియోగం కోసం భూములను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, భూమి అప్పగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. నగరాభివృద్ధి, పౌర సౌకర్యాల కోసం జరుగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులకు ఈ భూమార్పిడి అత్యవసరమని గుర్తు చేశారు. అదే విధంగా, గత కొంతకాలంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలంటూ రక్షణ మంత్రిని అభ్యర్థించారు.

# కాంగ్రెస్ పాలనలో ఆర్థిక విధ్వంసం

- **జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో అట్టడుగు స్థానం**
- **వ్యవసాయం నుంచి రియల్ ఎస్టేట్ దాకా అన్నింట్లో పతనం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **మూడు రోజుల విదేశీ పర్యటనకు పయనం**

**తెలంగాణ బ్యూరో, ప్రజా స్వరం :** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎక్స్ వేదికగా శుక్రవారం ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండడం దారుణమన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, కాంగ్రెస్ పరిపాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం నుంచి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని వివరించారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేల చూపులే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుంచి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



**యూఎస్ పర్యటనకు కేటీఆర్**

మరోవైపు, మూడు రోజులు వ్యక్తిగత విదేశీ పర్యటనకు కేటీఆర్ వెళ్లారు. ఈ పర్యటనలో ఆయన తన కుమార్తె విద్య కోసం పలు కాలేజీలను పరిశీలించనున్నట్లు సమాచారం. కేటీఆర్ తిరిగి హైదరాబాద్‌కు ఆదివారం రాత్రి రానున్నారు. యథావిధిగా సోమవారం నుంచి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

## కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలపై
# కాషాయ జెండా ఎగరేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

చేరబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

ఈ ఎన్నికలు జరగాలని ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని సంజయ్ తెలిపారు. "కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. నిధులేమీ లేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గ్రామాల్లో సర్పంచులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా మంది అప్పులు తీరచేయలేక ఊళ్లను వదిలి నగరాలకు వలస వెళ్ళారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పుడు బీజేపీని అధికారంలోకి తెచ్చి అభివృద్ధి దిశగా నడిపించేందుకు ప్రజలంతా కసరత్తు చేస్తున్నారు" అని అన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు, తాజా మాజీ సర్పంచులు, ఉద్యోగులే ఈసారి బీజేపీ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తారని బండి సంజయ్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ పాలనలో ఈ వర్గాలందరికీ అన్యాయం జరిగింది. హామీలు ఇచ్చి ఒక్కటినీ అమలు చేయలేదు. మహిళలకు నెలనెలా 2500 రూపాయలు, వృద్ధులకు పెన్షన్ పెంపు, రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు భరోసా కార్డులు - అన్నీ మోసమే అయ్యాయి. ఈసారి ఈ వర్గాలే కాంగ్రెస్ కు బుద్ధి చెప్పబోతున్నారు" అని మండిపడ్డారు.

అభ్యర్థుల టిక్కెట్ల విషయంలో బీజేపీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, రాష్ట్ర నాయకత్వం సర్వేలు నిర్వహిస్తోందని సంజయ్ తెలిపారు. "గెలిచే అవకాశం ఉన్న వారికే టిక్కెట్లు ఇస్తాం. టిక్కెట్ రాకపోయినా బాధపడొద్దు. పార్టీ పదవుల రూపంలో గౌరవం, సహాయం అందిస్తాం. కానీ పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కష్టపడాలి. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేసినట్లే. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తాం" అని హెచ్చరించారు.

గ్రామాల్లో జరుగుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర నిధులతోనే సాధ్యమయ్యాయని సంజయ్ గుర్తుచేశారు. "ఉపాధి హామీ పనులు, ప్రధాని సడక్ యోజన, సీఆర్ఎఫ్ నిధులతో రహదారులు, కమ్యూనిటీ హాళ్లు, బోర్లు - ఇవన్నీ మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వల్లే



సాధ్యమయ్యాయి. కాంగ్రెస్ పాలనలో పంచాయతీలకు ఒక్క పైసా కూడా రాలేదు. బీఆర్ఎస్ గెలిచినా పరిస్థితి మారదు. గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక నాయకులు, సిరిసిల్ల జిల్లా నాయకుడు సురేందర్ రావు సహా పలువురు నేతలు బండి సంజయ్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. "సంజయన్నా... మీరు సెస్ ఎన్నికల్లో కేటీఆర్ కు చుక్కలు చూపించారు. మాకు అండగా నిలిచి సహాయం చేశారు. మీ మేలు మేమెప్పటికీ మరవలేం. జన్మంతా రుణపడి ఉంటాం" అని కృతజ్ఞతలు తెలిపారు.

### మాజీ సర్పంచ్ మేడ రాజయ్య

# సేవలు మరువలేనివి



- **ప్రజా సేవలో ఆదర్శంగా నిలిచిన నాయకుడు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.**

**మంథని/పెద్దపల్లి,అక్టోబర్03(ప్రజా స్వరం):**

స్వర్గీయ మాజీ సర్పంచ్ మేడ రాజయ్య సేవలు మరువలేనివని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు.మంథని మండలం గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ మేడ రాజయ్య వర్ధంతి సంధర్భంగా గ్రామంలోని రాజయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ రాజయ్య నిస్వార్ధ రాజకీయ నాయకుడని,తనకు అవకాశం కల్పించిన ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకు సాగిన గొప్ప నాయకుడని అన్నారు.ఐదుసార్లు సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన ఉన్న ఊరికి మేలు చేయాలని ఎంతో తపన పడ్డాడని ఆయన సేవలను కొనియాడారు.గ్రామాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడని అలాంటి నాయకుడు లేకపోవడం బాధాకరమన్నారు.ప్రజా సేవలో మేడ రాజయ్య ఆదర్శమని,ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజయ్య కుటుంబ సభ్యులు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమంలో ఉండి సాధించేది ఏమీ లేదు



- **-ఏసీబీ గజ్జి కృష్ణ.**

**పెద్దపల్లి,అక్టోబర్03(ప్రజా స్వరం)**

మావోయిస్టులు ఉద్యమంలో ఉండి సాధించేది ఏమీ లేదని జనజీవన ప్రవంతిలో కలిసి పోవాలని ఏసిపి గజ్జి కృష్ణ అన్నారు.గురువారం మావోయిస్టు నేత కంకణాల రాజిరెడ్డి గ్రామమైన కిష్టంపేటలో రాజిరెడ్డి తల్లి వీరమ్మ ను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ ఉన్న ఊరును కన్నతల్లి తండ్రులను విడిచి అడవిలో ఉండి సాధించేదేమీ లేదన్నారు.రాజిరెడ్డి లొంగిపోయి వృద్ధాప్యంలో ఉన్న తల్లి వీరమ్మ యోగక్షేమాల చూడాలన్నారు.లొంగిపోతే ప్రభుత్వం నుండి వచ్చే రివార్డుతోపాటు ఉపాధి కల్పిస్తామన్నారు.అనంతరం వీరమ్మకు దసరా పండుగ సందర్భంగా బట్టలు పండ్లు బియ్యం అందించారు.ఆయన వెంట సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి,ఎస్సై వెంకటేష్ ఉన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, అక్టోబర్ 02(ప్రజాస్వరం):**

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మండల పరిధిలోని జనగాం గ్రామంలో ప్రతిష్టించిన అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ మేరకు అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలంతా ఆనందంగా ఉండాలని తెలిపారు. ప్రజలంతా పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సాయిని నారాయణ్ రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, ఉప్పరి మల్లేశం, అంతప్ప, బి.పెంటయ్య, సంజీవ్, బాలప్ప, నర్సింహులు, లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా విజయదశమి సంబరాలు

- **పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**


**మెదక్ అక్టోబర్ 03 (ప్రజా స్వరం)**

చెడు పైన మంచి విజయం సాధించినందుకు చిహ్నంగా విజయదశమి పర్వదినం జరుపుకుంటున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో నిర్వహించిన విజయదశమి సంబరాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రౌండ్ రకరకాలపైన పాటసులు కాల్చారు. మెదక్ పట్టణ సీఐ కుమార్తెలు చేసిన సాంస్కృతిక నృత్యం అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం మెదక్ ఎమ్మెల్యే చిన్నారులను జ్ఞాపిక తో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ నియోజవర్గ ప్రజల అందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మెదక్ నియోజవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటు లో ఉంటూ కుటుంబ సభ్యుల పని చేస్తానని అన్నారు.






















# గాంధీజీ సిద్ధాంతాలను భావితరాలకి తెలియజేయాలి

- **గాంధీజీ మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలి**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, అక్టోబర్ 02( ప్రజాస్వరం):**

గాంధీజీ సిద్ధాంతాలు భావితరాలకి తెలియజేయాలని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీ ప్రబోధించిన సత్యం, అహింస అనేవి మానవాళి నిత్య జీవనానికి బలమైన శక్తినిస్తాయని తెలిపారు. గాంధీజీ వాటిని స్వయంగా ఆచరించి, వాటి శక్తిని చూపించారని చెప్పారు. ధైర్యం, నిరాడంబరతతో మార్పును సాధించుకోవచ్చని మహాత్మా గాంధీ నిరూపించారని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం, ఇతరులపై కరుణతో ఉండటమే మన సాధికారికతకు శక్తిమంతమైన సాధనాలు అని విశ్వసించారని చెప్పారు. మహాత్మా గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సాయిని నారాయణ్ రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, ప్రవీణ్, సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి, నల్లా ఎల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, ఉప్పరి మల్లేశం, కోహీర్ రవిశంకర్, శోభారాణి, విద్యాసాగర్, మహమ్మద్ రియాజ్, డీవై నర్సింహులు, ఆనందచారీ, సుమిత్రా రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గంగాదేవి నవరాత్రి ఉత్సవాలు



**మంథని/పెద్దపల్లి,అక్టోబర్03(ప్రజా స్వరం):**

బెస్తపల్లి శ్రీ గంగాదేవి నిత్య దీపారాధన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా గంగాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.శుక్రవారం మంథని మండలం బెస్తపల్లి గ్రామంలో నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.11 రోజులు అమ్మవారికి పట్టు వస్త్రాలతో నిత్యం పూజ దీప ధూప నైవేద్యంతో పూజారి సుధాకర్ వెలదీశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బెస్తపల్లి,దుబ్బపల్లి,చందనాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆత్మ హత్య చేసుకోవడానికి వెళ్తున్న వృద్ధురాలుకు కౌన్సిలింగ్



- **మేమున్నాం అని భరోసా కల్పించిన సీఐ ఇంద్రసేన రెడ్డి.**

**గోదావరిఖని/పెద్దపల్లి,అక్టోబర్03(ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠల్ నగర్ కు చెందిన వృద్ధురాలు తన పిల్లలు పట్టించుకోవడం లేదని వాళ్లకు నేను భారంగా ఉండటం ఎందుకు అని మనస్థాపం చెంది గోదావరి నదిలో దూకి చనిపోవాలని నిర్ణయించుకుంది.ఆటో ఎక్కి డ్రైవర్ కి గోదావరి నది వద్దకు వెళ్ళాలి నేను చనిపోతా అని తెలపగ ఆటో డ్రైవర్ పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకు వచ్చాడు.రిసెప్షన్ సిబ్బంది వృద్ధురాలు ను ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డికి కల్పించగా సీఐ వృద్ధురాలుకు నీకు మేము ఉన్నాం నీ పిల్లలు పట్టించుకోకపోయినా మాతో ఉంచుకుంటాం,చనిపోవడం సమస్య కాదు అని చెప్పి విఠల్ నగర్ ప్రాంతంలోని ఒక ప్రజా ప్రతినిధితో మాట్లాడి వాళ్ళ ఇల్లు,కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని ఎస్ఐ అనూష బ్లూ క్లోట్స్ సిబ్బంది నీ పంపించి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు.ఆత్మ హత్య పరిష్కారం కాదని ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి కలవాలని తెలిపాడు.వృద్ధురాలికి భరోసా కల్పించిన సిఐ పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు.

## ముత్తారంలో కోలాహలంగా వంశ వృక్ష ఆత్మీయ సమేళ్మనం




- **నాలుగు తరాలకు చెందిన 150 మంది హాజరు.**

**ముత్తారం/పెద్దపల్లి,అక్టోబర్ 03(ప్రజా స్వరం):**

నాలుగు తరాల కుటుంబ సభ్యులు ఒకే వేదికపై శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ సమ్మేళనానికి పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్ (ఫంక్షన్ హాల్) వేదికయింది.ముత్తారం మండల కేంద్రానికి చెందిన పింగిలి కీ.శే కాంతమ్మమల్లారెడ్డి దంపతులకు కీ.శే రాజిరెడ్డి,నర్సింహా రెడ్డి,క్రీ.శే,మల్లక్క పాల్కల భారతి,కర్నా వెంకటలక్ష్మి అనే ఇద్దరు కుమారులు,ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.కాంతమ్మ మల్లరెడ్డి దంపతులు వ్యవసాయం చేస్తూ పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశారు.ఈ వేడుకలలో కుమారులుకోడళ్లు,కుమార్తెలుఅల్లుళ్లు మనుమలు,మునిమనుమలు,మనవరాళ్లు ఇలా మొత్తం ఈ కుటుంబంలో40 మంది ఉన్నారు.వీరిలో చాలామంది వ్యాపారం చేస్తుండగా,యువతరంలోని పలువురు ఉద్యోగాల రీత్యా విదేశాల్లో స్థిరపడ్డారు.ఏడేళ్ల క్రితం కాంతమ్మ మల్లారెడ్డి దంపతులు మృతిచెందగా,వారి జ్ఞాపకార్థం వంశవృక్ష ఆత్మీయ వేడుక నిర్వహించారు.ఆ కుటుంబానికి చెందిన కట్ల మల్లక్క కుమారుడు జనార్ధన్ రెడ్డి మూడు నెలలుగా అందరికీ సమాచారం ఇస్తూ,అవసరమైన నగదును,ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు.ఈ సమ్మేళనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి 150 మంది హాజరై ఆటపాటలతోపాటు నృత్యాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వికుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కుటుంబ బంధుత్వాలతో పాటు వాటి విలువ గురించి వివరించారు.ఈ సమావేశానికి వచ్చిన వారు పరస్పరం ఆత్మీయంగా అనుభవాలను పంచుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు.బంధుత్వాలను కాపాడుకుంటూ తరతరాలకు తెలియజేయడం సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి,దేవేందర్రెడ్డి,పింగిలి సంజీవ రెడ్డి,క్రాంతి రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగం పెంచాలి

- **తాత్కాలిక మరమత్తు పనులు, మహిళా శక్తి భవన నిర్మాణ పనుల పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ అక్టోబర్ 03 (ప్రజా స్వరం)**

మెదక్ నుండి ముక్త భూపతిపూర్ తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మెదక్ నుండి ముక్త భూపతిపూర్ వెళ్లే తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాలు వరదలు తాకిడికి గతంలో మెదక్ ముక్త భూపతిపూర్ బ్రిడ్జి భారీగా దెబ్బతిన్న దానిని తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం జరిగిందని వాటిని పరిశీలించి పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రం గాంధీ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణ లను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం పనులను వేగం పెంచాలని అధికారులను ఆదేశించామని వివరించారు. అనుకున్న సమయానికి కంటే ముందే భవనం అందుబాటు లోకి తీసుకుని రావాలని అన్నారు.






# అహింసాయుత మార్గంలోనే మనం నడుచుకోవాలి

- **వికారాబాద్ జిల్లాలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు**

**వికారాబాద్, అక్టోబర్ 2 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా వికారాబాద్, తాండూర్, పరిగి కొడంగల్ నియోజకవర్గం పరిధిలో గురువారం ప్రజలు మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణాల్లో గ్రామాల్లో గాంధీ విగ్రహాల వద్ద గురువారం ఉత్సాహబరిత వాతావరణ కనిపించింది. వివిధ సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహాత్మ గాంధీ విగ్రహాలకు , చిత్రపటాలకు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చి ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకునేలా చేసిన ఘనత మహాత్మా గాంధీ ఒక్కరికే దక్కుతుందని పలువురు పేర్కొన్నారు. గాంధీజీ చూపిన అహింసాయుత మార్గంలో మనం నడుచుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పెద్దేముల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన జాతిపితకు ఘనంగా నివాళులు అర్పించారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పరిగి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం మాజీ ప్రధాని స్వర్గీయ లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది. బాపూజీ మార్గంలో నడుస్తూ సత్యం, న్యాయం, సమానత్వం విలువలను కాపాడుదాం: మెతుకు ఆనంద్ గాంధీ జయంతి సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని *గాంధీ పార్క్ లో గల మహాత్మా గాంధీ విగ్రహానికి వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో తన అహింసా సిద్ధాంతం, సత్యాగ్రహం మరియు ఉపవాస దీక్షలతో యావత్ దేశాన్నిఈ కతాటిపై నడిపిన మహనీయుడు మహాత్మాగాంధీ అని అన్నారు. మనమంతా బాపూజీ చూపిన మార్గంలో నడుస్తూ సత్యం, న్యాయం, సమానత్వం విలువలను కాపాడుతూ సమాజ నిర్మాణానికి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్ నాయకులు పాల్గొన్నారు.












# సీఎంకు దసరా శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

- **కొడంగల్ లో సీఎంను కలిసిన జిల్లా ప్రజలు**

**వికారాబాద్,(ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా కొడంగల్ కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి *ఎనముల రేవంత్ రెడ్డి పండుగ సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు సీఎం రేవంత్ రెడ్డిని స్వయంగా కలుసుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్ లో వారి నివాసంలో తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తాండూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లి లో దసరా ఉత్సవాలు ప్రారంభించి అనంతరం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ కు రావడం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకే గురువారం రాత్రి కొడంగల్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి రాత్రి తన స్వగృహంలో బస చేశారు.సీఎంను కలిసిన నాయకులు ఈ సందర్భంగా వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటి ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతూనే స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేసి కాంగ్రెస్కు విజయాన్ని చేకూర్చి పెడతామని హామీ ఇచ్చారు. కొడంగల్ లో వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం శుక్రవారం మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్కు వెళ్లిపోయారు.







# దేవరయాంజాల్ లో ఘనంగా మహాత్మా గాంధీకి ఘన నివాళులు

**శామీర్ పేట అక్టోబర్ 03(ప్రజాస్వరం)**

తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్, వికాస మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పుర ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,స్థానికులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి,ఆయన అహింసా సిద్ధాంతాలను, దేశ సేవను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీ జీవితం, దేశానికి అందించిన సేవలు, త్యాగాలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా స్థానికులు దుర్గం శ్రీరాములు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పట్నం నర్సింహా రెడ్డి, మాజీ కౌన్సిలర్ పచ్చిమాడ్ల నర్సింగ్ రావు గౌడ్, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహా రెడ్డి, నాయకులు బక్కోల నర్సింగ్ రావు, రంగప్పగారి నాగరాజు గౌడ్, అడ్వకేట్ వెంకటేష్ గౌడ్, మున్సిపల్ వార్డు ఆఫీసర్ మహేందర్, మున్సిపల్ జవాన్లు తూంకుంట భార్గవి, తీర్చిగళ్ళ సత్యనారాయణ, వికాస మండలి సభ్యులు దుర్గం శ్రీనివాస్ గౌడ్, ఉప్పల ప్రవీణ్, పోలగాని శ్రీనివాస్ గౌడ్, రాచ నిశాంత్, మద్దూరి శ్రీపాల్ గౌడ్, దండోత్కర్ కిషన్, బొమ్మల వాసు, తీర్చిగళ్ళ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా రావణ దహనం

**శామీర్ పేట అక్టోబర్ 03(ప్రజాస్వరం)**

విజయదశమి పర్వదినం సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్ లో శుక్రవారం అద్భుతమైన సంస్కృతిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు పేండం యాదగిరి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు హాజరైనారు.

**అనంతరం పాల పిట్ట దర్శనం,**

దుర్గా మాత, శివాలయం, పోచమ్మ గుడి, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్య ఆకర్షణగా ఏర్పాటు చేసిన రవణాసురుని ప్రతిమను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు నాయకుల సహకారంతో ఎంతో ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన రవణ దహనం, దేవతల విజయాన్ని, ధర్మ పరాయణతను ప్రజలకు గుర్తు చేసేలా నిలిచింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, అల్వాల్ సొసైటీ డైరెక్టర్ నాలుక యాదగిరి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ పీసరి సుధాకర్ రెడ్డి, జాతీయ కళా మండలి అధ్యక్షులు యన్ వై అశోక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు గోల్డ్ శ్రీనివాస్ ముదిరాజ్, తిరుపతి లావణ్య శంకర్ గౌడ్, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ పేండం లక్ష్మినారాయణ, ధర్మకర్తలు ఎల్లెంకి భారతి, భీమిడి కోండల్ రెడ్డి, నానిగళ్ళ హరిగోపాల్, గుడిసేని హరికృష్ణ గారు,రామాలయం మాజీ చైర్మన్లు దాసరి గోపాల్ రెడ్డి, పన్నాల సుధాకర్ రెడ్డి, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పట్నం నర్సింహా రెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్తలు పట్నం నర్సింహా రెడ్డి, బక్కోల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పచ్చిమాడ్ల నర్సింగ్ రావు గౌడ్, బక్కోల యాదమ్మ నర్సింగ్ రావు, ఇడంబోయిన ఉమ శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రంగప్పగారి భారతి నాగరాజు గౌడ్, దూసరి మమత మహేష్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు పిన్నింటి ధర్మారెడ్డి, మిర్యాలకర్ సాయి కుమార్, భర్ల నరేందర్ రెడ్డి, పిన్నింటి మహిపాల్ రెడ్డి, నేమురి సాయి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ రవణ దహనం వేడుక సాంప్రదాయ, సాంస్కృతిక విలువలను ప్రతిబింబిస్తూ, గ్రామస్థులు, నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయదశమిని ఘనంగా జరుపుకున్నారు. ఇది ప్రజల ఐక్యత, భక్తి భావం,సంస్కృతిని చాటేలా నిలిచింది.



# దౌల్తాబాద్ లోని లాల్ బహదూర్ శాస్త్రిజయంతి వేడుకలు

**దౌల్తాబాద్, అక్టోబర్ 2 (ప్రజాస్వరం)**

మండల కేంద్రమైన దౌల్తాబాద్ లో లాల్బాదృశాస్త్రి జయంతిని పురస్కరించుకొని స్థానికులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేయడం జరిగింది. సందర్భంగా స్థానికులు, సంఘాల సభ్యులు, విద్యార్థులు, యువత మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన త్యాగం, నాయకత్వం, సమాజసేవ మరియు దేశాభిమానం పై స్ఫూర్తి పొందారు. అనంతరం ఆయన జీవితం, స్వాతంత్ర్య సమరంలో తీసుకున్న కీలక పాత్ర, సామాజిక, విద్యా రంగాల్లో చేసిన సేవలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. సభాపతులు, సంఘం నేతలు మాట్లాడుతూ: "లాల్ బహదూర్ శాస్త్రి భారతీయ ప్రజల కోసం కొనసాగించాల్సిన బాధ్యతపై మనమంతా స్పిరించుకోవడం సంతోషకరమన్నారు ఈ కార్యక్రమంలో బ్యాటరీ శివ రమేష్ స్వామి గౌడ్ వచ్చీనీకాంత్ మనోహర్ పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు



# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా

- **వికారాబాద్ జిల్లాలో ఘనంగా దసరా పండుగ ఉత్సవాలు**
- **శ్రీ అనంతన్న పద్మనాభ స్వామి వారి జాతర**
- **ఉత్సవాల్లో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**
- **ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి ,మెతుకు ఆనంద్**

**వికారాబాద్, (ప్రజాస్వరం)**

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగను గురు, శుక్ర రెండు రోజులపాటు వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు ,పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలకు పలువురు ప్రముఖులు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా భవాని మాత ఆలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. వికారాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆలంపల్లి అనంత పద్మనాభ స్వామి ఆలయంలో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలంపల్లి అనంత పద్మనాభ స్వామి ఆలయం లో దసరా ఉత్సవాల సందర్భంగా స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాండూరు పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో పెద్ద ఎత్తున పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దసరా పండుగ విజయదశమి రోజున వస్తుంది,

**ఇది తొమ్మిది రాత్రుల నవరాత్రులను అనుసరించి వస్తుంది.**

ఇది దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన సందర్భాన్ని సూచిస్తుంది. , ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది . ప్రజలు బతుకమ్మ పండుగను దసరా నవరాత్రుల లో భాగంగా జరుపుకుంటారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆలంపల్లి వద్ద శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నిర్వహించిన జాతర ఉత్సవాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక ప్రజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పెద్దేముల్ మండల కేంద్రంలో, జనగాం గ్రామంలో దేవి నవరాత్రుల్లో భాగంగా నెలకొల్పిన పలు దుర్గామాత అమ్మవార్లని స్థానిక నాయకులతో కలిసి దర్శించుకొని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు

**శ్రీ దుర్గామాత అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

పరిగి పట్టణంలో మనోహర శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత అమ్మవారిని పరిగి ఎమ్మెల్యే , డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తాండూరు పట్టణంలోని భవాని మాత బోనమ్మ దేవత ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


## బండమీదిపల్లిలో ఘనంగా దసరా సంబరాలు

**అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పల్లకిసేవా**
**రావాణ కాష్టంతో బాణాసంచ కాల్చి వేడుకలు**
**అలైబలైతో ఐక్యమత్య చాటుకున్న గ్రామస్తులు**

యాలాల మండలంలోని బండమీదిపల్లి గ్రామంలో గురువారం దసరా పండుగా సంబురాలు అంబరాన్ని అంటాయి. గ్రామంలోని ఆడపడచులు, చిన్న, పెద్ద అందరు ఊరడమ్మ దగ్గర చేసుకొని సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు శ్రీ రాములు, సీతామాత, లక్ష్మణుడు, ఆంజనేయుడి వేశాధారణలో గ్రామస్తులు భజనలు చేస్తూ ధుర్గామాత అమ్మవారికి పల్లకి సేవా చేశారు. అంతకు ముందు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం రావణుడి సంహారం కోసం చిన్నారి రాములు భాణం ఎక్కుపెట్టి పదితలల రావణుడిని దహనం చేశారు. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున భాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆటపాటలతో అలరించారు. అనంతరం అలయ్‌బలయ్ నిర్వహించి గ్రామస్తుల ఐక్యమత్యాన్ని చాటుకున్నారు.














# ప్రమాదానికి పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాలి

- సీఐటీయు బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్.

**గోదావరిఖని/పెద్దపల్లి, అక్టోబర్03(ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా రామగుండంటు ఏరియాలోని ఓసిపి(త్రి ప్రాజెక్ట్ లో గురువారం సెకండ్ షిఫ్ట్ లో జరిగినటువంటి ప్రమాదానికి పూర్తి బాధ్యత యజమాన్యం వహించాలని సిఐటియు బ్రాంచ్ కమిటీ డిమాండ్ చేసింది.ప్రస్తుతము గాయపడిన ఎంజాల లక్ష్మీనారాయణ కు హైదరాబాద్ ఒమేగా హాస్పిటల్ లో తలకు ఆపరేషన్ జరిగిందని ,అబ్జర్వేషన్ లో ఉన్నారని,ప్రమాదానికి గల కారణాలను బ్రాంచ్ సెక్రటరీ కుంట ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.ఫైర్ కోల్ ఉండడం వల్ల దాని నుండి వచ్చినటువంటి దట్టమైన పొగ పల్టీ పడిన ప్రగతి షావెల్ వైపు వస్తుండడం,పని ప్రదేశము ఇరుకుగా ఉండడంతో సుమారు సాయంత్రం 7గంటలకు పని ప్రదేశము సరిగ్గా కనిపించక పోవడం వలన,డోజర్లు అందుబాటులో లేక ఫేసు లెవల్ చేయకపోవడంతో,పని ప్రదేశంలో లైటింగ్ పూర్తిగా లేకపోవడం వల్ల మరియు కోల్ ను చాలా డీప్ నుండి తీసి లోడ్ చేస్తున్న క్రమంలో మిషన్ ట్రాక్ మూమెంట్ ఆటోమేటిగ్గా మూవ్ అవ్వడం వలన ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇట్టి సమయంలో కొంతమంది అధికారులు అతి ఉత్సాహం చూపిస్తూ,నోటికి వచ్చినట్టు గాయపడిన కార్మికుడిపై ఆరోపణలు చేయడం సరికాదని,గాయపడ్డ కార్మికుడు నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవికి భక్తిశ్రద్ధలతో ఒకపొద్దులు నిర్వహించే సమయంలో జరిగిన ఘటనను మద్యం తాగి నడపడం వల్ల జరిగిందని ప్రచారం చేయడం,కార్మికులను చులకన చేసి హేళనగా మాట్లాడడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు.భవిష్యత్తులో అధికారులు కార్మికులపై వారి యొక్క తప్పుడు ఆలోచన స్వభావాన్ని మార్చుకోకపోతే కార్మిక సంఘాలను కార్మికులందరికీ ఐక్యం చేసి తీవ్ర ఉద్యమాలకు తెరలేపాల్సి వస్తుందని,భవిష్యత్తులో ఇటువంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు



- గాంధీ సేవలు మరవరానివి
- గంప రవి

**దౌల్తాబాద్, అక్టోబర్ 2 (ప్రజాస్వరం):**

గాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన దౌల్తాబాద్ ఆర్యవైశ్య సంఘం ఘనంగా కార్యక్రమం నిర్వహించింది. సంఘం అధ్యక్షుడు గంప రవి నాయకత్వంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు వందనం చేశారు. కార్యక్రమంలో గాంధీ తత్త్వాలు, అహింసా, సత్యాగ్రహ మార్గాలు, సమాజానికి ఆయన చూపిన మార్గదర్శకత్వంపై ప్రత్యేక చర్చలు జరిగాయి. సంఘం సభ్యులు, స్థానిక ప్రముఖులు, యువత, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని సార్థకంగా చేశారు.

**గంప రవి మాట్లాడుతూ:**

"మహాత్మా గాంధీ జీవితం ఎప్పటికీ సమాజానికి దారిదీపం. ఈ జయంతి కార్యక్రమం ద్వారా ఆయన ఆలోచనలను యువతలో పునరుజ్జీవితం పరచడం మా ముఖ్య లక్ష్యం" అన్నారు. ఈ కార్యక్రమంలో సముద్రాల శ్రీశైలం మా శెట్టి నరేష్ శ్రీరామ్ శ్రీనివాస్ పబ్బ అశోక్ శ్రీరామ్ హరికిషన్ డాక్టర్ కిషన్ పబ్బ మాధవి పసుపు నూరి పద్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొని చివర, పాల్గొన్నవారు.

# కోళ్ల ఫారంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

**దౌల్తాబాద్ అక్టోబర్ 03 (ప్రజా స్వరం):**

మండల పరిధిలోనిముత్యంపేట గ్రామంలోని సంధ్య లేయర్ పౌల్ట్రీ ఫారం దొంగతన కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

**సంఘటన సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి**

గత సెప్టెంబర్ 29వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ముత్యంపేట గ్రామంలోని సంధ్య లేయర్ పౌల్ట్రీ ఫారంలోకి ప్రవేశించి రెండు బీడ్ పైపులు, ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్ ఛానెల్‌లను అపహరించాడు. ఈ విషయాన్ని పౌల్ట్రీ ఫారం యజమాని అయ్యగారి నర్సింలు గమనించి వెంటనే దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎస్‌ఐ జి. అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**అనుమానితుడి అరెస్టు**

తరువాత అక్టోబర్ 2న సాయంత్రం 5 గంటల సమయంలో దౌల్తాబాద్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక వ్యక్తి తన (ద్విచక్ర వాహనం) బైక్‌పై అనుమానాస్పదంగా వస్తువులను తీసుకెళ్తూ కనిపించాడు. అతడిని ఆపి విచారించగా సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**విచారణలో నిజం వెలుగులోకి**

సి.ఐ తొగుట లతీఫ్, ఎస్‌ఐ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిపిన సుదీర్ఘ విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతడు ముత్యంపే గ్రామంలోని పౌల్ట్రీ ఫారంలో దొంగతనానికి పాల్పడినట్లు చెప్పడంతో పాటు, కుకునూర్‌పల్లి మండల పరిధిలో రెండు దొంగతనాలకు కూడా పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు నిందితుడి వద్ద నుండి దొంగిలించిన పైపులు, ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు, మరియు నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుడు రిమాండ్‌కు**

సాక్ష్యాధారాలతో పాటు నిందితుడి అంగీకార వాఖ్యాలు పోలీసుల దర్యాప్తులో బలంగా నిలిచాయి. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రస్తుతం నిందితుడు రిమాండ్‌లో ఉన్నాడు.




**స్థానికుల అభిప్రాయం**

ఈ ఘటనపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కోళ్ల ఫారాల్లో వరుసగా దొంగతనాలు జరగడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు ఇలాంటి సంఘటనలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ జీవితం యావత్తు ప్రపంచ మానవాళికి అనుసరణీయమం

- మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్

**శామీర్ పేట అక్టోబర్ 2(ప్రజాస్వరం).**

జాతిపిత మహాత్మా గాంధీ జీవితం యావత్తు ప్రపంచ మానవాళికి అనుసరణీయమం అని శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం మజీద్ పూర్ లో ఉన్న ఆయన విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర సమరంలో ముందుండి ఉద్యమాన్ని నడిపించి దేశానికి బానిసత్వం నుండి విముక్తి కల్పించిన మహనీయుడని రమేష్ కీర్తించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ డైరెక్టర్ తుంకి భిక్షపతి, మున్సిపాలిటీ అధికారి వేణుగోపాల్ సీనియర్ నాయకులు తుంకి మల్లేష్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కోడూరి నర్మద, తుంకి మల్లేష్ (పోలీస్), నాటకారి.వెంకటయ్య,వల్లపు మహేష్, గొట్టిముక్కుల శంకర్ ముదిరాజ్, గొట్టిముక్కుల మహేష్, అబ్బగౌని విరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# డీఎస్పీగా ఎదిగిన ఆది దీక్షిత –విద్యార్థులకు స్ఫూర్తి దీప్తి

- ఎస్సై అరుణ్ కుమార్

**దౌల్తాబాద్, అక్టోబర్ 3(ప్రజాస్వరం) :**

“కృషి ఉంటే కలలు నిజమవుతాయి” అనే వాక్యానికి నిదర్శనంగా నిలిచాడు దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆది దీక్షిత. గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబరచి డీఎస్పీ హోదా సంపాదించడం మనకెంతో గర్వకారణం అని దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుపెట్టుకుని క్రమశిక్షణతో చదివితే ఎవరైనా ఉన్నత స్థానాలు సాధించవచ్చు. ఆది దీక్షిత విజయం ప్రతి విద్యార్థికి ఓ మార్గదర్శకం” అని పేర్కొన్నారు. దీక్షిత ప్రయాణం ఒక్కరాత్రిలో జరగలేదని, ఎన్నో అడ్డంకులను అధిగమించి, అనేక గంటల శ్రమతో, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో సాధించిన ఫలితం ఇదని వారు స్పష్టం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో సమయం వృథా చేయకుండా, ప్రతి రోజు కొంత సమయం క్రమబద్ధంగా చదువుకు కేటాయించండి. లక్ష్యాన్ని పెద్దదిగా పెట్టుకుని చిన్నచిన్న విజయాలను మెట్లుగా ఉపయోగించండి. ఆది దీక్షితలాంటి విజయవంతుల్ని ఆదర్శంగా తీసుకుని మీ భవిష్యత్తును నిర్మించుకోండి” అని స్ఫూర్తి నింపారు. ప్రతి ఒక్కరూ పాటించవలసిన అంశాల్లో ప్రధానమైనది కృషి+ క్రమశిక్షణ పట్టుదల= ఎవరైతే వాటిపై దృష్టి సాధిస్తారు వారికి విజయం తప్పదు అన్నారు. తరువాత మున్నూరు కాపు సంఘం సభ్యులు శాలువా కప్పి, తప్పదు పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయ చైర్మన్ ఆది శివరాములు, వెంకన్న, ఆది వేణుగోపాల్, ఆది బాలకృష్ణ, ఆది రామకృష్ణయ్య, ఆది మహేష్, ఆది ముకుందం, నరేష్, రాజశేఖర్, లడ్డు, బైరవరెడ్డి, నర్సింలు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.







# ఐదు లక్షల నిధులతో హైమాస్ లైట్స్ ఏర్పాటు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్.

**రామగుండం/పెద్దపల్లి, (ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో టీయూఎఫ్ఐడిసి నిధులతో 25,38,47వ డివిజన్లలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్స్ ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల భద్రత,సౌకర్యం దృష్ట్యా రాత్రి వేళల్లో రహదారులు వెలుగుతో నిండేలా నగరంలో అవసరమైన ప్రదేశాల్లో ఆధునిక లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా ఇంధీరానగర్ చౌరస్తా,అడ్డగుంటపల్లె వంటి బిజీ ఏరియాలలో లైటింగ్ వసతులు ఏర్పడటం వలన ట్రాఫిక్ సౌకర్యవంతంగా మారడమే కాకుండా,ప్రజలకు సురక్షితమైన వాతావరణం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని,రామగుండం నగరంలో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నగరపాలక మాజీ కార్పొరేటర్లు,పార్టీ నాయకులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దామోదర్ రెడ్డికి నివాళి

- **అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి**
- **భౌతికకాయానికి సీఎం సహా ఇతర ప్రముఖుల నివాళి**
- **పార్టీకి, నల్లగొండ ప్రజలకు తీరని లోటు: రేవంత్ రెడ్డి**

**తెలంగాణ బ్యూరో, ప్రజా స్వరం :**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని దామోదర్ రెడ్డి నివాసంలో ప్రజల సందర్శనార్థం పార్థివ దేహాన్ని ఉంచారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు అక్కడకు వెళ్లి నివాళులు అర్పించారు. దామోదర్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసిన సీఎం, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి, నల్లగొండ ప్రజలకు తీరని లోటు అని చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి సహా ఇతర నేతలు కూడా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని అన్నారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి స్పందిస్తూ, దామోదర్ రెడ్డి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కోలుకుని తిరిగి పార్టీలో యాక్టివ్ అవుతారని భావించామని అన్నారు.

# న్యూడ్ ఫోటోలు పంపించాలని నా కూతురిని అడిగాడు

- **ఆన్‌లైన్ గేమ్‌లో తన కుమార్తెకు ఎదురైన వేధింపుల ఘటనను బయటపెట్టిన అక్షయ్ కుమార్**
- **పొగడ్తలతో మొదలుపెట్టి న్యూడ్ ఫోటో పంపాలంటూ ఆగంతకుడి బెదిరింపు**
- **ఎంతో మంది చిన్నారులు బాధితులవుతున్నారని ఆవేదన**
- **పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచన**
- **స్కూళ్లలో సైబర్ క్రైమ్‌పై ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**నేషనల్‌బ్యూరో, ప్రజా స్వరం :**

ఆన్‌లైన్ గేమ్స్ ఆడే పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తూ, ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ తన కుమార్తెకు ఎదురైన ఓ భయానక అనుభవాన్ని పంచుకున్నారు. సైబర్ నేరగాళ్లు చిన్నారులను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నారో వివరిస్తూ అందరినీ హెచ్చరించారు. శుక్రవారం జరిగిన 'సైబర్ అవేర్‌నెస్ మంత్ 2025' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ షాకింగ్ ఘటనను ఆయన బయటపెట్టారు.కొన్ని నెలల క్రితం తన కుమార్తె నితార ఇంట్లో ఆన్‌లైన్ వీడియో గేమ్ ఆడుతుండగా ఈ సంఘటన జరిగిందని అక్షయ్ కుమార్ తెలిపారు. "గేమ్‌లో పరిచయం లేని వ్యక్తితో ఆడుతున్నప్పుడు, మొదట చాలా మర్యాదగా మెసేజ్‌లు వచ్చాయి. 'గేమ్ బాగా ఆడుతున్నావ్', 'చాలా బాగా ఆడావ్' అంటూ పొగడ్తలతో మెసేజ్‌లు పంపాడు. అంతా బాగానే ఉందనిపించింది" అని ఆయన వివరించారు.

ఆ తర్వాత సదరు వ్యక్తి "నువ్వు ఎక్కడి నుంచి?" అని అడగ్గా, తన కుమార్తె 'ముంబై' అని సమాధానమిచ్చిందని అక్షయ్ చెప్పారు. "ఆ తర్వాత, 'నువ్వు అబ్బాయా, అమ్మాయా?' అని అడిగాడు. దానికి ఆమె 'అమ్మాయి' అని చెప్పింది. కొద్దిసేపటి తర్వాత, 'నీ న్యూడ్ పిక్చర్ పంపగలవా?' అని మెసేజ్ పంపాడు. ఆ మెసేజ్ చూడగానే నా కూతురు వెంటనే గేమ్ ఆఫ్ చేసి, జరిగిందంతా నా భార్యకు చెప్పింది. ఆమె అలా చెప్పడం చాలా మంచిదైంది" అని అక్షయ్ కుమార్ అన్నారు. ఇది కేవలం తన కుమార్తె సమస్య కాదని, ఇలాంటి సైబర్ నేరాల బారిన పడి ఎంతోమంది చిన్నారులు బ్లాక్‌మెయిలింగ్‌కు గురవుతున్నారని, కొన్నిసార్లు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిజిటల్ ప్రపంచంలో పిల్లలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం అత్యవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని పాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి వరకు ప్రతి వారం సైబర్‌క్రైమ్‌పై ఒక పీరియడ్ కేటాయించాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. వీధి నేరాల కన్నా ఈ సైబర్ నేరాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.









# దొమ్మాటలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాలు

- **గ్రామ వీధుల్లో పదసంచాల్**
- **పూల వర్షంతో మహిళలు– యువజన సంఘాల హర్షం**

**దౌల్తాబాద్, అక్టోబర్ 3 (ప్రజా స్వరం):**

సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామం శుక్రవారం ఆధ్యాత్మిక-సాంస్కృతిక వాతావరణంలో కదిలిపోయింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రధాన వీధుల గుండా పదసంచాల్ (ప్రదర్శన) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పదసంచాల్ ప్రారంభమైన క్షణం నుంచి గ్రామమంతా ఉత్సాహభరితంగా మారింది. మహిళలు, యువజన సంఘాల సభ్యులు పూల వర్షం కురిపిస్తూ స్వయంసేవకులను ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాస్ రెడ్డి, శ్రీ శ్రీ రామ్ చరణ్ శర్మ గురూజీ సంఘం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, సమాజ నిర్మాణంలో, జాతి అభ్యున్నతిలో సంఘం పోషిస్తున్న పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారు మాట్లాడుతూ, “దేశభక్తి, క్రమశిక్షణ, సమాజ సేవ - ఇవన్నీ సంఘం పునాది సూత్రాలు. స్వయంసేవకులు ఎప్పటికప్పుడు సమాజానికి అండగా నిలుస్తారు” అని అన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న గొడుగు సోమేందర్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ప్రారంభమైన నాటి నుండి గత 100 ఏళ్లలో ప్రపంచానికి చేసిన సేవలను సవివరంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ, “సంఘం కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు, అది ఒక విలువల పాఠశాల. స్వయం సేవకులు నిరంతరం దేశం కోసం త్యాగం చేస్తూ, అవసరమైన ప్రతి చోట సేవ అందిస్తున్నారు” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఖండకార్యవాహ సిలివేరి కనక రాములు, ఖండ కార్యకారిణి సభ్యులు, దొమ్మాట గ్రామ ప్రజలు అందరూ పాల్గొని శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేశారు. గ్రామ వీధుల్లో ప్రదర్శన కొనసాగినంతసేపు దేశభక్తి నినాదాలు మార్మోగి, సాంప్రదాయ-సాంస్కృతిక ఉత్సాహం నిండిపోయింది.









EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999